కథా నిలయం
శ్రీకాకుళం

# ఉద్యోగ పర్వం

ఆదివారం అయితే చాలు ఆవలింతలు, ఒళ్లు విరుపులు, ఎక్కడలేని బద్ధకం ఆవహిస్తుంది. నిద్రమెలకువ వచ్చిన తరువాత కూడా కనీసం అరగంటసేపు పక్క పైన అటూ ఇటూ పొర్లాడి గానీ లేకపోవటం అనే ఆనవాయితీ మరికొంతకాలానికి మా ఇంటి ఆచారంగా రూపుదిద్దుకుంటే అశ్చర్యపోనక్కర్లేదు. ఆదివారం నాటి కార్యక్రమాలన్నీ రోజూకంటె విభిన్నంగా జరిగితేనే అందంగా వుంటుందనేది నా అభిప్రాయం. అందుకే ఆదివారంనాడు ఇంట్లో పనులన్నీ అలాగే అమలు చేస్తుంటాను.

యాదృచ్ఛికంగా శ్రీమతి పనులుకూడా అలానే ప్రారంభమై అలాగే కొనసాగి ముగుస్తుంటాయ్. పనిమనిషి పనిలోకి చేరినరోజే ఆదివారం మాత్రం పన్లోకి రాను అని స్పష్టంగా చెప్పేసింది.

కేవలం ఆ ఒక్క కారణంగానే ఆ పనిమనిషి నాకు గొప్పగా నచ్చింది. ఆదివారం, పిల్లల్ని రోజులా ఉదయాన్నే నిద్రలేపే శ్రీమతిపైన విసుక్కోవటం, వెంటనే ఆవిడ నాపైన కసురుకోవడమూ తరచుగా జరుగుతుండే సాధారణ విషయం.

అలా మా అలుమగల మధ్యన విసుర్లు, కసుర్లు కొంచెం తీవ్రంగా జరుగుతూ ఉన్న ఓ ఆదివారం ఉదయం నా స్నేహితుడు మురళి వచ్చాడు. అతని రాకతో మా కీచులాట ఉన్నపళంగా సద్దుమణిగింది. వాదన ఎక్కడ, ఏ పాయింట్ దగ్గర ఆగిపోయిందో ఇద్దరం గుర్తుపెట్టుకుని, గంటు పెట్టుకున్న ముఖాల్ని బలవంతంగా విప్పార్చి, చెరికొంచెం నవ్వు అరువు తెచ్చుకుని, మా అన్యోన్యానికి ఎరువుగా వాడుకుని, వాడ్ని ఆహ్వానించాం ఉమ్మడిగా.

ఉభయకుశలోపరి పూర్తయిన తరువాత మా ఉభయులకూ చెరొక కాఫీ కప్పు అందించి లోపలికి వెళ్లింది శ్రీమతి. అతిథికి వినిపించని రీతిలో ఎలాగైతేనేం పోరుపెట్టి పిల్లల్ని నిద్రలేపింది. అటు తరువాత పని మనిషిని

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఇష్టంవచ్చినట్లు తిట్టుకుంటూ అంట్లగిన్నెలముందు కూర్చుంది. పని మనిషిమీద ఉన్న కసిని గిన్నెలమీద చూపనారంభించింది.

"కాసేపు డాబా మీదకు వెళ్దాం రా.. నీతో ఓ విషయం మాట్లాడాలి" అడిగాడు మురళి.

ఇద్దరం మెట్లెక్కి డాబాపైకి చేరుకున్నాం.

"ఏమిట్రా ఏమిటి విశేషం" అడిగాను.

"విశేషమయితే ఇంతసేపా. విషాదంతో కూడిన విచిత్ర సమస్యరా" అన్నాడు.

"సస్పెన్స్ వద్దులే కానీ సమస్సేంటో చెప్పు" అన్నాను.

"ఏముందిరా... వాలెంటరీ రిటైర్‌మెంట్ అంటూ ఉద్యోగాలకు ఉద్వాసనపలికే సమస్య ఒకటొచ్చి పడింది కదరా.."

"ఆర్థికపరమైన లాభాలు బేరీజువేసుకుని, అనుకూలంగా వుంటే రిటైరవటం, లేదంటే ఉద్యోగంలోనే కొనసాగటం చేస్తున్నారు కదా. నీవూ అదేచెయ్... దానికి అంత తలకాయ పట్టుకుని కూర్చోవాల్సినంత జటిల సమస్య ఏం వుంది?"

"నా ఉద్యోగం గురించి కాదురా... సావిత్రి గురించి" సావధానంగా చెప్పాడు మురళి.

"ఆమెకూ అదే సూత్రం వర్తిస్తుంది కదా"

"సూత్రాలు, శాస్త్రాలూ అందరికీ ఒకటే నాయనా. వచ్చిన చిక్కల్లా మా ఇద్దర్లో ఎవరం ఉద్యోగం మానేయాలి అనే తప్ప ఎంత సొమ్ములు వస్తాయని కాదు" చెప్పాడు మురళి.

"అప్పుడు అర్థమయింది నాకు వాడి అసలు సమస్య. ఆమెని రిటైరవ్వమని వాడు వాడ్ని, రిటైరవ్వమని ఆమె వాదించుకుంటూ, ఎవరికి వారే ఉద్యోగాల్ని వదులుకోలేక పోతున్నారని అర్థంచేసుకున్నాను. ఆ విషయమే వాడితో అన్నాను.

అంత ఆందోళనలోనూ విరగబడి నవ్వాడు మురళి. వాడి నవ్వు అసందర్భంగా తోచిన నాలో అసహనం చోటు చేసుకున్నది. అందుకే. "ఏమిట్రా ఆ పిచ్చి నవ్వు" అన్నాను కోపంగా.

"నీ పిచ్చి అంచనాకు సమాధానమే ఈనా పిచ్చి నవ్వు" అని మళ్ళీ నవ్వసాగాడు.

"అంటే" ఆర్థోక్తిగా ఆగాను.

"..............."

"నేనెందుకు అలా అంచనావేశానో అర్థంచేసుకోలేక నవ్వుతున్నావ్ నువ్వు" అన్నాను కోపంగా.

"వివరంగా చెప్పు... వింటాను" అన్నాడు.

"ఏముంది సింపుల్. మొగుళ్లనే వాళ్ళందరికీ పెళ్లాం జీతం ముద్దు ముద్దుగా వుంటుంది కాని పెళ్లాం ఉద్యోగం చేయటం ఇష్టం వుండదు. అదోతమాషా అంతే. సంపాదిస్తున్నానని నీకు పొగరు. వెధవ ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చో రేపట్నుంచి అని అనని ఉద్యోగస్థురాలి భర్త బహుశా వుండడేమో. కనీసం ఒక్క సారయినా అనకుండా ఒక్కడూ వుండడేమో!

అలాగే ఆడవాళ్ళల్లో కూడా చాలామంది, ఒక రకంగా ఎక్కువమందే అనుకోవచ్చు. చదువు పూర్తికావటానికి, పెళ్లికుదరటానికి మధ్య కాలంలో ఉద్యోగం మీద, సంపాదన మీద మోజుతోనో, క్రేజుతోనో ఓ అప్లికేషన్ పడేయటం. ఓ పరీక్షరాయటం, తలవని తలంపుగా ఇంటర్వ్యూకి వెళ్ళటం, అప్రయత్నంగా, అయాచితంగా వచ్చిన ఉద్యోగంలోకి ఉరకలేసి ఉత్సాహంతో చేరిపోవటం షరామామూలుగా జరిగే సాధారణ విషయం.

పెళ్ళయ్యాక కొత్త మలుపులు తిరుగుతుందిక ఆ ప్రహసనం. సంపాదన ఇచ్చే సంతృప్తితోపాటు మొగుడి అదిరింపులకు, బెదిరింపులకు అలవాటు పడినతర్వాత ఆ ఉద్యోగం ఆసరాగా, ఆలంబనగా చివరకు అవసరంగానూ, ఆయుధంగానూ మారిపోతుంది. ఆలుమగల మధ్యన తలెత్తే మనస్పర్థలకు, కీచులాటలకు అదరకుండా, బెదరకుండా వుండగలిగే మనస్థయిర్యాన్నిచ్చే ఉద్యోగం కొందరికి ఊతంగా పనిచేస్తుంది.

అన్యోన్యంగా సాగిపోయే సంసారాల్లో మాత్రం ఆడమనిషికి ఉద్యోగం అదనపు భారంగా, అనవసరపు శ్రమగా అనిపించినా చూస్తూ, చూస్తూ నెలతిరిగేసరికి వచ్చే జీతం సొమ్ము ఆ శ్రమని, భారాన్ని మరిపింపచేస్తుంది. అందుకే సమస్యలు ఎదురయ్యే వరకు చేస్తున్న ఉద్యోగాన్ని కొనసాగిస్తూ వుంటారు. అందుకే ఆర్థికంగా ఎదిగిన కుటుంబాల్లో కూడా ఆడవారు ఉద్యోగాలు చేస్తూనే ఉంటారు"

"నీ పరిశోధన బాగానే వుందిరా. కాని నాకు, సావిత్రికి మధ్యన నలుగుతున్న సమస్య నీవు అనుకుంటున్నదానికి పూర్తిగా వ్యతిరేకంరా. అక్కడే వచ్చిన సమస్యంతా" అన్నాడు మురళి.

"ఏమిట్రా నువ్వనేది"

అవున్రా నేనేమో తన ఉద్యోగం కంటిన్యూ చేయమని, నేను వి.ఆర్.ఎస్‌కు అప్లయ్ చేస్తాననీ అంటున్నాను. కాదు కూడదు మీరే ఉద్యోగం

చేయండి నేను రిటైర్‌మెంట్‌కు అప్లయ్ చేస్తానంటుంది సావిత్రి. మొదట్లో మామూలుగా ప్రారంభమైన సమస్య రాన్రాను పెద్ద రగడగా మారిందిరా... ఎలా చెప్తే సావిత్రికి అర్థం అవుతుందో అంతుపట్టటంలేదు. విషయాలన్నీ వివరంగా చెప్పాను ఆమెకు, అయినా నా మాట వినడం లేదు"

"విషయాలు నాకు తెలియవుకానీ... ఎందుకో సావిత్రి చెప్తున్నదే సబబుగా తోస్తున్నది నాకు. ఆర్థికపరంగా ఆలోచిస్తే నిజానికి సావిత్రి కూడా ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏమీలేదు. ఉద్యోగం చేయాలన్న ఉబలాటం, ఆరాటం బహుశా ఆమెకు తీరిపోయి వుంటయ్. ఇక ఇంటిపట్టున ఉండి పిల్లలపట్ల నీ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలనుకుంటున్నదేమో ఆమె.

మీ ఇద్దరి మధ్యనా ఎటువంటి అభిప్రాయభేదాలున్నా ఆమె అలాంటి నిర్ణయం తీసుకునేదికాదు. ఒకరకంగా చెప్పాలంటే నువ్వు అదృష్టవంతుడివి. ఆమె యోగ్యురాలు.. అంతే"

"బాగుంది... నువ్వయినా ఆమెకు సలహా ఇచ్చి ఒప్పిస్తావని ఆశతో నీ దగ్గరికివస్తే ఆమె యోగ్యురాలంటూ, నేను అదృష్టవంతుడ్ని అంటూ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నావ్. ఆమె యోగ్యత గురించీ నా అదృష్టాన్ని గురించి నీ అభిప్రాయం కోసం కాదు నేనొచ్చింది" ఆవేశంగా అన్నాడు మురళి.

"నేను చెప్తున్నది అక్షరసత్యంరా నాయనా... ఎందుకో తెల్సా నిత్యం నువ్వంటే నువ్వని పోట్లాడుకునే ఆలుమగలు ఇద్దరూ ఉద్యోగస్థులయితే ఎటువంటి పరిస్థితిలోనూ ఆమె ఉద్యోగం వదులుకోవటానికి ఇష్టపడదు. ఎందుకో తెల్సా మొగుడు తనని వదిలించుకోవాలన్నా లేక తనే మొగుడిని వద్దనుకున్నా ఉద్యోగం ఎంతో అవసరం కనుక. నా ఉద్దేశ్యంలో ఈ కారణంతోనే ఉద్యోగం చేస్తున్న వాళ్ల సంఖ్య చాలా ఎక్కువే వుంటుంది"

"అంటే ఆడవాళ్లకి ఇదో అదనపు సదుపాయం అన్నమాట. ఉద్యోగం ఊడితే (ఒకవేళ) మొగుడి మీద, మొగుడు వద్దంటే ఉన్న ఉద్యోగం మీద హాయిగా బ్రతికేయొచ్చంటావ్" నా అభిప్రాయానికి వక్రభాష్యం చెప్పాడు మురళి.

"నువ్వంతగా సంబరపడిపోనక్కర్లేదు. మగ వాళ్లేం తక్కువ తిన్లేదు. ఆఫీసులకు సక్రమంగా వెళ్లకుండా, ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియనివిధంగా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే భర్తల్తో బాధలుపడే భార్యలు చాలామందే ఉన్నారు. బ్రతిమాలి భర్తల్ని ఆఫీసుకు పంపటం చాలామంది ఇల్లాళ్ల బాధ్యతగా తయారయింది.

వాళ్లు చేసిన అప్పులు తీరుస్తూ ఆ కాస్తా ఆసరా కూడా పోతే వీధిన పడాల్సొస్తుందనే భయంతో భర్తల్ని భరిస్తున్న గృహిణులు ఎందరో వున్నారు పాపం. జీతం డబ్బులు జల్సాలకు వినియోగించుకుని, విసుగునీ, కోపాన్ని భార్యలమీద చూపే భర్తల్ని భరించక తప్పని భార్యలెందరో వున్నారు"

"సర్సరే నువ్వటు మగవాళ్లనీ సమర్థించగలవ్ ఇటు ఆడవారినీ వెనకేసుకురాగలవ్. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరగ్గలిగిన వాడివిలే మొత్తానికి" వెటకారంగా అన్నాడు మురళి.

"ఉద్యోగం పురుషలక్షణం" అన్నాడు. పురుషులందు పుణ్యపురుషులు వేరని కూడా అన్నాడు. ఈ రెండింటి సారాంశం ఏమనగా ఉద్యోగులు పుణ్యపురుషులు కాలేరని లేదా పుణ్యపురుషులకు ఉద్యోగ (సర్కారువారి) ప్రాప్తి ఉండదు అని కూడా అన్వయించుకోవచ్చు"

"నా విషయంలో నువ్వేదైనా సహాయం చేయగలవా. లేదా? నేను నీతో సంప్రదించి, ఓ సలహానో, సహకారమో తీసుకుందామని వచ్చాను. నువ్వేమో 'లోకం పోకడ' ఆలుమగల అంతరంగాలు వగైరాలు చెప్తున్నావ్‌తప్ప వ్యవహారం ముందుకు పోనీటం లేదు" అన్నాడు మురళి.

"సరే అయితే సూటిగా అడుగుతున్నాను.

నువ్వూ సూటిగా సమాధానం చెప్పుమరి. నువ్వు ఉద్యోగం మానేసి అదే రిటైర్‌మెంట్ తీసుకుని, సావిత్రిని ఉద్యోగం చేయమనటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి, అందువలన మీకు ఆర్థికంగా ఎక్కువ లాభం రావటం లాంటిది ఏమైనా వుందా... చెప్పు"

"నువ్వంత సూటిగా అడిగావు కాబట్టి చెప్తున్నాను. అయినా నీకు తెలియని విషయం కాదు. కాస్తోకూస్తో పై ఆదాయం వచ్చేసదుపాయం ఉన్న ఉద్యోగినికదా. నీ దగ్గర దాపరికం ఎందుకు, అందినంత దండుకున్న మాటనిజం.

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోమని చెప్పారు గదా పెద్దలు. అందుకనే వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకున్నాను. ఆశకు అంతెక్కడుంది. అయినా అనుకున్న దానికంటె ఎక్కువగానే కూడగట్టుకున్నాను.

"ప్రస్తుతం ఉద్యోగస్తుల ఉనికికే ముప్పు వాటిల్లుతున్నది. అందరికళ్లూ అటుపైనే ఉన్నాయ్. ముందు ముందు రోజులెలా వుంటాయో చెప్పలేం. పై ఆదాయం మాట అలావుంచు. ఇప్పటివరకూ దండుకున్న భాగవతం బయటపడిందంటే ఇంటికి పంపటం మాటెలావున్నా నాకు రావలసిన డబ్బులన్నీ ఎగ్గొట్టి ఒట్టిచేతుల్లో నెట్టిపారేస్తారేమోనన్న భయం పట్టుకుంది. అదే ఇప్పుడు ఈ వి.ఆర్.ఎస్‌లో బయట పడ్డాననుకో... అధికలాభం.

నాకు రావలసిన పైకంతో పాటు ఎక్స్‌గ్రేషియాగా మరోపది లక్షలకుపైగా వస్తాయ్‌రా... ఆ తర్వాత మన సంగతి తెలిసినా మనల్ని ఎవ్వరూ ఏం చేయలేరు. సావిత్రికి ఇలాంటి గొడవలేం లేవుకదా. హాయిగా తను ఉద్యోగం చేస్తుంటే, నాకు వచ్చే ఫైనాన్షియల్ బెనిఫిట్స్‌తో ఏదో వ్యాపారం చేద్దామని నా ఆలోచన, ఇప్పుడు చెప్పు నేను కరెక్టా...కాదా"

"ఇంతకీ ఈ వాలెంటరీ రిటైర్మెంట్ స్కీము నీలాంటి పుణ్యపురుషుల పాలిట ఓ వరమన్న మాట. మూటలు గట్టుకున్న వారికి, లంచాలు దండుకున్న వారికీ దండనలేవి లేకపోంగా పారితోషికంగా (పరిహారం పేరిట) నగదు ముట్టచెప్పి మరీ సాగనంపుతున్నారంటావ్. దొంగలకు బహుమానాలతో ఘనంగా వీడ్కోలు పలికేందుక్కూడా ఈ స్కీము చాలా ఉపయోగపడిందంటావ్"

"మరీ అలా కుండలు పగలకొట్టుకురా.. నాకు ఆఫీసుకు టైమవుతున్నదిగానీ సాయంత్రం మా ఇంటికి తగలడు.సావిత్రికి ఎలా చెప్తావో, ఏం చెప్తావో నీ ఇష్టం. నీ మాటంటే ఆమెకు గురి. నా ప్లానంతా నీచేతుల్లో వుంది. వస్తామరి" అని చెప్పి నా సమాధానంకోసం చూడకుండా వెళ్లిపోయాడు.

"ఆదివారం కూడా ఆఫీసుకు వెళ్లి పనిచేస్తున్నాడంటే, వాడు చెప్పిన ప్రకారం అదేదో లాభసాటి వ్యవహారమే అయివుంటుంది"అనుకున్నాను.

"ఏమోయ్... బుర్రంతా వేడెక్కింది. ఇంకో కప్పు కాఫీ ఇస్తావా" అడిగాను శ్రీమతిని.

"అయిదునిమిషాలు ఓపిక పట్టండి. డికాషన్ అయిపోయింది" సమాధానం చెప్పిందామె.

మురళి చెప్పిన విషయాలపైకి ఆలోచనలు మళ్ళినై మళ్లీ. "సంస్కరణలన్న తర్వాత సమస్యలు తప్పవు.అవి ప్రవేశపెట్టిన తొలిరోజుల్లో అయితే ఆ సమస్య తీవ్రత ఎక్కువగా ఉండటంకూడా సహజమే. సంస్కరణల వలన ప్రజలకి ప్రయోజనం వుండాలనేది ఒకప్పటి లక్ష్యం. ఇప్పటి సంస్కరణ లన్నీ సర్కారువారికి ఆదాయం చేకూర్చేవిగా వుండటమే పదార్థంగా ప్రవేశపెట్టబడుతున్నయ్.

రాజకీయ నాయకులు రాజకీయం చేయకుండా, వ్యాపారం చేయడం ప్రారంభించారు. ఏమార్పు అయినా ఖజానాకు కాసుల వర్షంకురిస్తే చాలు అనే సిద్ధాంతాన్ని అధినేతలు ఆచరణలో పెట్టేస్తున్నారు.

శ్రీమతి పిలుపుతో ఆలోచన్లనుంచి బయట పడ్డాను. ఆమె ఇచ్చిన కాఫీతాగి రోడ్డునపడ్డాను. నెమ్మదిగా మురళి ఇంటికి దారితీశాను.

"రండి అన్నయ్యగారూ" అంటూ సాదరంగా ఆహ్వానించింది సావిత్రి.
"ఏమ్మా కులాసానా"
"ఆc... బాగానే వున్నాం అన్నయ్యా... ఉదయం ఈయన మీ ఇంటికి వచ్చారట కదా...మీరు వస్తారని కూడా చెప్పి వెళ్ళారు" అందామె.
"అవునమ్మా... ఆ పనిమీదనే వచ్చాను. ఇంతకీ నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అడిగేను సావిత్రిని.
"ఏముందన్నయ్యగారూ... ఎన్ని కబుర్లు చెప్పినా ఆడవాళ్ళకి ఇంట్లో పని, ఆఫీసులో పని చేయాలంటే కష్టమే. పైగా పిల్లలు కాస్త పెద్దవాళ్ళయ్యాక, వాళ్ళ టైముకు వాళ్లని పంపటం, మేం ఇద్దరూ ఎవరి తోవనవాళ్ళు వెళ్ళటం... ఇవన్నీ అందరి ఇళ్ళలో వుండే ఇబ్బందులే అనుకోండి.
ఎలాగో ఈ వి.ఆర్.ఎస్ పుణ్యమాని ఇంతదాకా చేసింది చాలు, ఇక నేను రిటైర్మెంట్ తీసుకుంటాను. కాస్తోకూస్తో డబ్బువస్తుంది. నెలనెలా పెన్షనూ వస్తుంది. మీరు ఒక్కళ్ళూ ఉద్యోగం చేయండి, నేను ఇంటిదగ్గర ఉంటానంటే వినిపించుకోవటం లేదాయన" విషయాన్నంతా ఏకరువు పెట్టిందామె.
"మామూలు పరిస్థితుల్లో అయితే నువ్వు చెప్పేదంతా సబబేనమ్మా.... కానీ వాడి పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నదని రేపు ఉద్యోగానికి ప్రమాదం వస్తే బాధపడాల్సొస్తుందనీ అంటున్నాడు కదా" అనునయంగా అన్నాను.
"కోట్లకు కోట్లు కుంభకోణాలు జరుగుతుంటేనే కళ్ళు మూసుకుని, కాళ్ళు ముడుచుకొని కూర్చుంటున్నారు. అటువంటి పరిస్థితే వస్తే ఏదో ఒక మార్గం కన్పించకపోతుందా... చెప్పండి... అదీగాక ఆయన కనీసం మరోరెండు సంవత్సరాలు ఉద్యోగం చేసినా ఇప్పుడు వాళ్ళిచ్చే ఎక్స్‌గ్రేషియాకు రెట్టింపు సంపాదించవచ్చు. ఆయన ఆ విషయం అర్థం చేసుకోవడంలా" అన్నది సావిత్రి.
సావిత్రి మాటల్తో నా మనసు మొద్దుబారింది. ఏ రకమైన ఆలోచనలూ కలుగలేదు.
'ఉద్యోగం పురుషలక్షణమా!' అన్న సందేహం మొదటిసారి కలిగింది నాలో, 'ప్రతి పురుషుడి విజయం వెనుకా ఓ స్త్రీ వుంటుంది' అనే నానుడి కూడా ఆ సమయంలో నా మదిలో మెదిలింది. ఆడవారిదే పైచేయి అని ఊరకనే అన్నారా! మురళికి ఉద్యోగ పర్వం కొనసాగించక తప్పలేదు.

◆ స్వాతి - జూలై, 2001 ◆